వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 07 సెప్టెంబర్ 2023

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు శ్రీకారం చుడుతున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు వారి సమస్యలపై వెంటనే స్పందించి న్యాయం చేసేందుకు శక్తివంచనలేకుండా చేస్తామన్నారు. ముఖ్యంగా పూర్తి స్థాయిలో సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపర్పంచ్ తోట శివసాయితో పాటు వైసిపికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

నల్లగుట్టపల్లి గ్రామంలో ఉపాధి పనులపై గ్రామసభ

రామాపురం సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామంలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం కూలీలు చేసిన పనులకు సంబంధించి సోమాజిక బృందం బుధవారం సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సురేంద్రనాథ్ రెడ్డి మాట్లా డు తూ నల్లగుట్టపల్లి గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులు 196 పనులకు గాను రూ. కోటి 54లక్షల పనులు జరిగాయన్నారు. గ్రామంలో మొత్తం 4163 జాబ్ కార్డు ఉండగా అందులో 1134 మంది కూలీలు పనులు చేశారన్నారు. ఉపాధి పనులతో పాటు హౌసింగ్ ఆర్టికల్చర్స్ చేపట్టిన పనులపై రికార్డును పరిశీలించారు. 2022-23 సంవత్సరానికి సంబం ధించి మామిడి చెట్లు రైతు పొలాల్లో 20శాతం వరకు చనిపోయాయని వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి. ఆ గ్రామ సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్ రెడ్డి. సూరం వెంకటసుబ్బారెడ్డి. ఎంఈఓ చక్ర నాయక్ . డిఆర్ పి జ్ఞానేశ్వర్ రెడ్డి. ఈసీ శ్రీకాంత్ రెడ్డి టీఏలు సురేంద్రనాథ్ నాయుడు. బాబు. ఫీల్డ్ సిబ్బంది టి రఘునాథ .రాణా ప్రతాప్. ఉపాధి కూలీలు. పాల్గొన్నారు.

జగన్ పాలనలో
బడుగు, బలహీన వర్గాలకు, పేదలకు పెద్దపీట

రాయచోటి, సెప్టెంబర్ ప్రభాతవార్త

జగన్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు, పేదలకు పెద్దపీట వేయడం జరిగిందని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి మండలం గొర్లముదివీడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించారు. గ్రామంలోని ఆరవ వాండ్లపల్లె, ఏపిల వంక పల్లె, వల్లూరు వాండ్లపల్లె, చెరువుముందర కొత్తపల్లె, బోయపల్లె, బాలిరెడ్డి గారిపల్లె, హరిజనవాడలలో గడప గడపనూ శ్రీకాంత్ రెడ్డి సందర్శిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొర చూపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్నింటిలో బీసీ లకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వైఎస్ఆర్ చేయూత, నేతన్న హస్తం, రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, ఆటో వాలా లకు ఆర్థి సహాయం, బీసీ లకు చెందిన విద్యార్థుల తల్లులకు అమ్మఒడి తదితర పథకాల ద్వారా సింహభాగం బీసీలు లబ్ది పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. జగన్ పాలనలోనే సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. 53 కార్పోరేషన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారితో పాటూ వార్డు మెంబర్ల వరకు బీసీ కుటుంబం జన సముద్రంలా ఉందన్నారు. 82వేలమంది బీసీలు రాజకీయ సాధికారతతో పదవుల్లో ఉన్నారని, బిసిల హృదయంలో జగన్.. జగన్ హృద యంలో బిసిలు ఉన్నారన్నారు. అన్ని వర్గాలకు అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బాలిరెడ్డిగారిపల్లెలో శ్రీకాంత్ రెడ్డికి భారీ గజమాలతో స్వాగతం పలికిన బసిరెడ్డి సిద్దారెడ్డి బాలిరెడ్డి గారిపల్లెలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి టిటిడి ఢిల్లీ ప్రాంతీయ సలహా మండలి సభ్యుడు, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి బసిరెడ్డి సిద్దారెడ్డి ఆధ్వర్యంలో దుస్సాలువలతో సత్కరించి, భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. యువకులు పెద్ద ఎత్తున బ్యాండు మేళాలతో, టపాసులు పేల్చుతూ శ్రీకాంత్ రెడ్డికి బసిరెడ్డి సిద్దారెడ్డి ఆధ్వర్యంలో అనుచర గణముతో కలిసి స్వాగతాలు పలికారు.

20 కుటుంబాలు వైసిపిలోకి చేరిక

గొర్ల ముదివేడు కు చెందిన 20 తెలుగుదేశం పార్టీ కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో టీటీడీ ప్రాంతీయ సలహా సభ్యుడు పార్టీ కార్యదర్శి బసిరెడ్డి సిద్దారెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేరారు ఏపీ లంక పల్లె రామాలయంలో శ్రీకాంత్ రెడ్డి కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, టిటిడి ప్రాంతీయ సలహా మండలి సభ్యుడు , పార్టీ రాష్ట్ర కార్యదర్శి బసిరెడ్డి సిద్దారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి గంగిరెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, సింగల్ విండో అధ్య క్షుడు బసిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపిడిఓ మల్‌రెడ్డి, సర్పంచ్ రాజమ్మ రఘునాథ, కాంట్రాక్టర్ చలమా రెడ్డి, రాజారెడ్డి, బిసి నాయకుడు ఈశ్వరయ్య, చెన్నకృష్ణ, రామిరెడ్డి, వైఎస్ఆర్ సిపి జిల్లా విద్యార్థి సంఘ అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, షేక్ రియాజ్ భాషా, మహేష్ రెడ్డి, రఘునాథ పక్కిర రెడ్డి దస్తగిరి రెడ్డి, ప్రేమ నాథరెడ్డి, అల్తాఫ్, రమణయ్య , కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న బొప్పాయి

– ఖర్చు తక్కువ – లాభం అధికం

రామసముద్రం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

బొప్పాయి సాగు రైతుల ఇంట సిరులు కురిపిస్తున్నాయి. సాగుకు ఖర్చు తక్కువ, పంట ఎక్కువ లాభాలు వస్తుండడంతో రైతులు బొప్పాయి పంట సాగుపై ఆసక్తి కనపరుస్తున్నారు. గతంలో సీజన్‌లో మాత్రమే రైతులు పంట సాగు చేపట్టేవారు. కానీ ఇప్పుడు పట్టణాల్లో, నగరాల్లో బొప్పాయికి అధికంగా డిమాండ్ ఉండడంతో అన్ని కాలాల్లో ఈ బొప్పాయి పంటను సాగు చేస్తున్నారు. రామసముద్రం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోని పంట పొలాల్లో బొప్పాయి సాగు ఈ ఏడాది ఎక్కువ విస్తీరణంలో సాగు చేపట్టారు. ఎకరం పొలానికి రూ.80వేలు ఖర్చు అవుతుంది. సంవత్సరానికి రెండు, మూడు సార్లు ఎరువులు, సేంద్రీయ ఎరువులతో పాటు ఆముదం పిండి, యూరియా, పోటాషియం వంటివి కూడా వేస్తారు. వీటికి సుమారు ఎకరాకు రూ.10వేలు ఖర్చు అవుతుంది. మొక్కలకు మందులు కలుపుకొని కొట్టడానికి కూలీలు,ఇతర ఖర్చులు కలిపి మరో రూ.15వేలు అదనంగా చివరకు పంటకు చేతికి అందేవరకు ఎకరాకు రూ.95వేలు ఖర్చు అవుతున్నట్లు గ్రామీణులు తెలిపారు. దిగుబడి బాగా వస్తే సుమారు అటో ఇటోగా 35 టన్నుల కాయలు కొతకు వస్తాయి. సంవత్సరానికి 250టన్నులు మంచి దిగుబడులు అందుతాయని తెలిపారు. ప్రస్తుత టన్ను రూ.15వేలు ప్రకారం చూస్తే సంవత్సరం మొత్తం మీద రూ.3.50లక్షలు ఆదాయం వస్తుందన్నారు. ఖర్చులు పోనూరూ.3.50లక్షలు ఆదాయం మిగులుతుందని రైతులు చెబుతున్నారు. అయితే బొప్పాయి పంటలకు ఎక్కువ గాలివీస్తే పంట పూర్తిగాపడిపోయి దెబ్బతింటుందన్నారు. ఈ పంటకు గరుకునేల ఎంతో ఉత్తమమైనదన్నారు. పంట కోతకు రాగానే బెంగుళూరు, చెన్నై, మదనపల్లె మార్కెట్ నుంచి బొప్పాయి కొనుగోళ్లకు వ్యాపారస్తులు వచ్చి వాళ్ళ కూలీలతోనే కాయనలు కోతలు చేస్తుంటారని పేర్కొన్నారు. అయితే బొప్పాయి డిమాండ్‌ను బట్టి బండ్లపై, సైకిళ్ళపై, తట్టిల్లో బుట్టల్లో సాయంత్రం, ఉదయం అన్న తేడా లేకుండా ప్యాకింగ్ చేసుకొని గ్రామాల్లోని పొలాల వద్ద అమ్మకాలు జరుపుతున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో అన్న తేడా లేకుడా అన్ని చోట్ల ఈ బొప్పాయిను కొనుగోలు చేస్తుండడంతో గిరాకీ బట్టి అన్ని సీజన్‌లలో ఈ పంట సాగు చేయకడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఎండకాలం, వర్షాకాలం, చలికాలం అన్న తేడా లేకుండా అన్ని కాలాల్లో ఈ పంటపై రైతులు మక్కువ చూపుతున్నారు. ఈ బొప్పాయి అమ్మే వారికి వ్యాపారంలో లాభాలు...తినేవాళ్ళకు ఆరోగ్యం దక్కుతుంది ఈ పంట వేసిన రైతులు కూడా లాభాల బాటలో పయనిస్తున్నారు.

నెలరోజులుగా టిడిపి కార్యక్రమాలు నిల్

రెండు నియోజకవర్గాల్లో జాడలేని టిడిపి ... అల్లర్ల కేసుల్లో అజ్ఞాతంలోనే నాయకులు

మదనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :



నెలరోజులుగా రెండు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. ముఖ్యంగా మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో టిడిపి నాయకుల జాడే కనపడలేదు. గతనెల 4న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన నిమిత్తం అంగళ్ళు, మదనపల్లెలో చేపట్టిన కార్యక్రమాల్లో అల్లర్లు చోటు చేసుకొన్న విషయం తెలిసిందే. ఈ అల్లర్ల విషయంపై వైకాపా నాయకుల ఫిర్యాదు మేరకు రెండు నియోజకవర్గాల్లోని టిడిపి నాయకులతో పాటు పీలేరు నియోజకవర్గానికి చెందిన కీలకమైన టిడిపి నాయకులపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కేసులు మోపబడిన పార్టీలో కీలకమైన టిడిపి నాయకులు అజ్ఞాతంలోకి వెళ్ళారు. మదనపల్లె మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషాతో పాటు రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, నియోజకవర్గ నాయకులు నెలరోజులుగా బెయిల్ కోసం అజ్ఞాతంలోకి వెళ్ళారు. ఇక తంబళ్ళపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్‌తో పాటు ఆ నియోజకవర్గ నాయకుల జాడ కనపడడం లేదు. పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లారికిషోర్ కుమార్ రెడ్డి, రాజంపేట ఎంపి అభ్యర్థి గంటా నరహరికి హైకోర్టు ఇటీవల కండీషన్ బెయిల్ మంజూరు చేసింది. త్వరలో టిడిపి నాయకులందరికి బెయిల్ రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. కేసులు ఉండడం వల్లే టిడిపి నాయకులు పార్టీ కార్యక్రమాలు నిర్వహించలేక పోయారని పార్టీవర్గీయులు చెబుతున్నారు.

రాజంపేట మున్సిపాలిటిలో
అమృత్ పనులకు మోక్షమెప్పుడు?

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త

- 30.12 కోట్లతో ప్రతిపాదనలు పంపిన పాలకవర్గం
- బద్వేల్, కడపలో రూ. 60 కోట్లతో నీటి పథకాలకు టెండరు

గ్రేడ్-2 మున్సిపాలిటిగా రాజంపేట మున్సిపాలిటిలో అభివృద్ధి పనుల పట్ల ప్రజాప్రతినిధుల చొరవ కరవు అయ్యింది. అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా ఉన్నతస్థాయిలో అధికారులతో చర్చించడం, త్వరగా పనులు చేపట్టేందుకు చొరవ చూపకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చక్రం తిప్పే నేతలున్నా చిత్తవుద్ధి కొరవడింది. ఫలితంగా రాజంపేట కన్నా వెనుక పంపిన ప్రతిపాదనలకు మోక్షం కలుగుతోంది. రాజంపేటలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పార్లమెంట్ కేంద్రంగా, నియోజకవర్గ కేంద్రంగా ఉన్నా అభివృద్ధి పనుల్లో మాత్రం పర్యవేక్షణ కొరవడి సకాలంలో పనులు జరగడంలేదు. అందుకు ఉదాహరణగా రాజంపేట మున్సిపాలిటికి కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్-3 పథకం కింద 30.12 కోట్ల రూపాయల నిధులు మంజూరైనా ఇంకా పరిశీలన దశలోనే సాగుతున్నాయి. మున్సిపాలిటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక భాగస్వామ్యంతో 70 కోట్ల నిధులు మంజూరు కావడం, జూన్ మొదటివారంలోనే మున్సిపల్ పాలకవర్గం సమావేశమై అమృత్ పథకం కింద పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. ఐదేళ్ల పాటు పథకం నిర్వహణకు ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖకు పాలకవర్గం ఆమోదం విషయాన్ని కూడా తెలియజేసింది. డిపిఆర్‌ను కూడా సిద్ధం చేసి పంపింది. మున్సిపాలిటి పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు అమృత్ పథకం నిధులను ఖర్చు చేయాలని సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసి పంపింది. అయితే ఇంతవరకు ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలవలేదు. వీటితో పాటు జిల్లాలో బద్వేల్ మున్సిపాలిటిలో 19.80 కోట్లతో హౌసింగ్ కాలనిల్లో మంచినీటి పథకానికి కడప కార్పొరేషన్‌లో 37.23 కోట్లతోను, అనంతపురం జిల్లాలోని రాయదుర్గం మున్సిపాలిటి 22.42 కోట్లతోను పంపిన ప్రతిపాదనలు పరిశీలన పూర్తి చేసుకుని 2 రోజుల క్రితం టెండర్లు పిలిచారు. ఇకనైనా ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిలు అమృత్ పథకం ద్వారా రాజంపేటలో నీటిసరఫరా వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించేందుకు రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో చర్చించి త్వరగా టెండర్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సేవాతత్పరుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఆకేపాటి ఎస్టేట్‌లో పది రోజులుగా నిర్వహించిన కంటి శస్త్ర చికిత్స
238 మంది వృద్ధులకు కంటి ఆపరేషన్లు

ముగింపు కార్యక్రమంలో మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

రాజకీయాల్లో ఉంటూనే ప్రజలకు నిరంతరం సేవా కార్యక్రమాలు అందించే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ని ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలని కడప మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆకేపాటి ఎస్టేట్‌లో 10 రోజుల పాటు నిర్విరామంగా నిర్వహిం చిన కంటివైద్య చికిత్స శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మేయర్ మాట్లాడుతూ 10 రోజుల పాటు చెన్నై శంకర నేత్రాలయ వారి సంచార ఆపరేషన్ సెంటర్‌లో 238 మందికి ఆపరేషన్‌లు చేయడం సామాన్యమైన విష యం కాదు అన్నారు. ఎందుకంటే ఆసుపత్రిలో ఆపరేషన్ లు చేయవచ్చని, సంచార వాహనంలో ఆపరేషన్‌లు చేయడం శిబిరానికి వచ్చే వందలాది మందికి వసతి ఏర్పాట్లు కష్టతరంగా ఉంటుందన్నారు. అయినా ప్రతిరోజు ఎంతో ఓపికతో అమర్‌నాథ్‌రెడ్డి శిబిరం నిర్వహించి విజయవంతం చేశారని అందుకే సేవకు మారుపేరు అమర్ అన్న అని కొనియాడారు. జడ్‌పి ఛైర్మన్ ఆకే పాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో ఎంతో తనకు సంతృప్తి నిచ్చే విషయమన్నారు. తమ సంపాదనలో తమశక్తి మేరకు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడాన్ని సంతృప్తిగా చేపడతా నన్నారు. ప్రస్తుతం 12 రోజుల పాటు శిబిరం ఏర్పాటుకు తాము ఎంత కష్టపడ్డామో అంతకంటే ఎక్కువగా పెద్దమనుసుతో రమేష్‌రెడ్డి కుటుంబం ఆర్థికంగా చేయూత నిచ్చిందని పేర్కొన్నారు. దాతల సహకారం మరువలేనిదన్నారు. శిబిరానికి 1250 మంది రోగులు వస్తే పరీక్షల తర్వాత ఆపరేషన్‌లకు 238 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా శిబిరాలు ఏర్పాటు చేసినా రెండు మూడు రోజులు మించి చేయవని, అలాంటిది 12 రోజులు శిబిరం ఏర్పాటు చేసి విజయవంతం చేయడం అమర్‌నాథ్‌రెడ్డికే సాధ్యపడుతుందన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ శంకర్ బృందం చేసిన సేవలను అమర్‌నాథ్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపాలిటి ఛైర్మన్ పోలా శ్రీని వాసులురెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, పోలి మురళి, డీలర్ సుబ్బరామిరెడ్డి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు!

– ప్రమాదపుటంచున విద్యార్థులు

కలికిరి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

కలికిరి పంచాయతీలోని చదివేవాండ్లపల్లె ప్రభుత్వ హైస్కూలు ముందు ప్రమాదం పొంచి ఉంది. అక్కడ ఏమాత్రం ఆదమరిచినా విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. చదివేవాండ్లపల్లె ప్రభుత్వ పాఠశాలలో 300కు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 12మంది వరకు ఉపాధ్యాయులున్నారు. అక్కడ ప్రధానోపాధ్యాయుడు సంపత్ అనాలోచిత నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలకు విద్యార్థులు ఏమాత్రం ఒక్క నిమిషం ఆలస్యం వచ్చినా పాఠశాల గేట్లు మూసివేసి బయట రోడ్డుపైనే విద్యార్థులను నిలబెట్టడం గేటు సమీపానే విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం అది విద్యార్థులు గమనించక దాని పక్కకు వెళ్తూ ఏ క్షణాన ప్రమాదం జరుగుతుందో అని అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు మంజూరైన నాడు-నేడు పనులు కూడా నిధులు ఖర్చు పెట్టడంలో కూడా అవకతవకలు జరిగాయని పనులు జరగకనే నిధులు డ్రా చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పాఠశాలను పర్యవేక్షించాల్సిన విద్యాశాఖాధికారులు పర్యవేక్షించకపోవడంతో నాడు-నేడు పనులు కూడా జరగడం లేదని విద్యార్తుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులను గేటు బయట నిలబెట్టి శిక్షించడం మానుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో కూడా పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పూర్తిగా పడిపోయింది. ఇకనైనా ఉన్నత స్థాయి అధికారులు పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

ప్రభుత్వ పథకాలకు నోచని గువ్వల చెరువు యానాదులు 2లో

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు కనుల విందుగా కళ్యాణం 4లో

పథకాల అమలును పర్యవేక్షిస్తున్న ఎంపీ

వీరబల్లి సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేవా ప్రజలు పథకాల గురించి ఏమనుకుంటున్నారు అనే విషయాల గురించి ఎంపీపీ గాలివీటి రాజేంద్ర నాథ్ రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక వీరబల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వీధిలో ఇంటింటికి రేషన్ బియ్యం అందిస్తున్న వ్యాన్ దగ్గరికి వెళ్లి మహిళల అభిప్రాయాలు తెలుసుకొని వారు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎవరికి ఏ అవసరం ఉన్నా తనకు తెలపాలని మీ వెన్నంటి ఉంటానని భరోసా ఇచ్చారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు థామస్ ఘనంగా సత్కారం

బద్వేల్ సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన బద్వేల్ మండలం ప్రాథమికోన్నత పాఠశాల చింతలచెరువు నందు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బి థామస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన సందర్భంగా పిఆర్టియు నాయకులు రవి శంకర్ రామకృష్ణంరాజు ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పిఆర్టియు నాయకులు రవిశంకర్ మాట్లాడుతూ థామస్ వృత్తి పట్ల ఎంతో నిబద్ధత క్రమశిక్షణ కలవారని తెలిపారు. అతను పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారని తెలిపారు. పిల్లలను చదువులోనే కాక సమాజం పట్ల అవగాహన పరుస్తూ మరియు క్రీడల పట్ల శ్రద్ధ చూపేవారని తెలిపారు. థామస్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు మంచి బోధనలు అందించి ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లినప్పుడే ఆ ఉపాధ్యాయునికి సమాజంలో విద్యార్థులు తల్లిదండ్రులు మంచి గుర్తింపు ఉన్నదని పిఆర్టియు పేర్కొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ లేక టీచర్స్‌కాలనీవాసుల ఇబ్బందులు

ఖాజీపేట సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

కడప జిల్లా ఖాజీపేట మండలం బస్టాండ్ వెనుక సైడ్ ఉన్న టీచర్స్ కాలనీలో రెండు వీధుల్లో చిన్నపాటి వర్షానికే సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక నీళ్లు నిలబడి దుర్వాసన వస్తున్న పట్టించుకునే నాదులే కరువయ్యారని టీచర్స్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు, చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ సరిగా లేకపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి వీధులు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు రోడ్డుపైకి వస్తున్నాయని బైక్ లు కార్లు వెళ్లేటప్పుడు పక్కన వెళ్లే వారిపై ఆ మురికి నీరు పడడంతో నిత్యం ఇబ్బందిగా మారిందని కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఈ వీదుల్లో ఎటు చూసినా డ్రైనేజీ నీరు ప్రవహిస్తూనే ఉంటుంది ఇప్పటికే టీచర్స్ కాలనీ వాసులు దోమలు, ఈగల బాధతో జ్వరాల బారిన పడ్డారని వాపోయారు. ఈ సమస్య గురించి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కూడా పట్టించుకోకపోవడం శోచనీయమని ఇప్పటికైనా అధికారులు కానీ, గడపగడపకు తిరుగుతూ సమస్యలు పరిష్కరిస్తున్న వైసిపి నాయకులు ఈ సమస్యపై దృష్టి పెట్టి టీచర్స్ కాలనీ వాసులకు ప్రాణాంతకమైన వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకుంటారని ఆ కాలనీ వాసులు కోరుచున్నారు.

కిడ్నీ వ్యాధితో అంపశయ్యపై శంకర్..

దాతలు ఆదుకోవాలని కుటుంబం వేడుకోలు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

నిత్యం జనజీవనంలో ఎందరో అభాగ్యులకు మనసున్న మారాజులు ఎన్నో రకాలుగా ఆదుకోవడం పత్రికల్లో పలు రకాల మీడియాల ద్వారా చదువుతూ ఉంటాం. అయితే ఓ దళిత యువకుడు రెండు కిడ్నీలు పాడై గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో కూలీ నాలి చేసి సంపాదించిన సొమ్ముతో అరకొర వైద్యం పొంది నేడు చివరి దశలో తనను ఆదుకొని కాపాడే దాత కోసం ఎదురుచూస్తున్న విషాదకర సంఘటన తంబళ్లపల్లె మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లి పంచాయతీ దళితవాడకు చెందిన ఎద్దుల శంకర్(44)ది నిరుపేద కుటుంబం. భార్య శాంతమ్మ, గౌతమి (15), శివమణి (17) పిల్లలున్నారు. వీరికి ఎలాంటి ఆస్తి, పాస్తులు లేవు. రోజూ కూలికి వెళ్తే కానీ పూట గడవని దుర్భర పరిస్థితి. శంకర్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆయన చికిత్స కోసం భార్య శాంతమ్మ అప్పులు చేసి పడరాని పాట్లు పడుతోంది. స్థానికంగా చికిత్సలు అందించి కాలం గడుపుతు వచ్చారు. ఆరు మాసాలు మరో మారు అస్వస్తతకు గురి కావడంతో మెరుగైన వైద్య పరీక్షలు చేయించగా శంకర్ పరిస్థితి విషమించిందని మేజర్ ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్యులు చెప్పారు. ఖర్చుతో కూడిన వైద్యం కావడంతో శాంతమ్మ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. శంకర్‌కు తరుచూ డయాలసిస్ చేయక తప్పడం లేదు. ఇందుకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ఇస్తున్న డయాలసిస్ పెన్షన్ చాలడం లేదు. శంకర్ ప్రస్తుతం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. భర్త పరిస్థితి విషమించి మంచాన పడడంతో శాంతమ్మ విధిలేక పిల్లలకు చదువు మాన్పించి వారిని తనతో పాటు కూలికి తీసుకెళ్తోంది. ఆ డబ్బుతో భర్త శంకర్‌కు వైద్యం చేయిస్తోంది. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని శాంతమ్మ కోరుతోంది. మనసున్న మారాజులు సాయం చేయాలనుకునే దాతలు ముందుకు వచ్చి వీరి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. 9390785680 నంబరును సంప్రదించి తమ దాతృత్వాన్ని చాటుకోవాలని వేడుకుంటున్నారు.

ఎజి అండ్ పి గ్యాస్ మరింత చౌకగా

-అసిస్టెంట్ మేనేజర్

వైవీయూ, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:

సెప్టంబర్ నెలకు సంబంధించిన డొమెస్టిక్ నేచ్యురల్ గ్యాస్ పిఎన్‌జి టారిఫ్ విడుదల చేసిందని అసిస్టెంట్ మనేజర్ తెలియజేస్తూ ఒక యూని ట్ గ్యాస్ ధర రూ 51గా నిర్ణయించడం జరిగిందని, నేచ్చురల్ గ్యాస్ వాడకం సురక్షితంగా, సౌకర్య వంతంగా నిరంతరంగా ఉంటుందని తెలిపారు. ఇది ఎల్‌పిజి ధరతో పోలిస్తే 12 శాతం తక్కువ ధరలో లభిస్తుందని, ఇప్పుడు నేచ్చురల్ గ్యాస్ పిఎన్‌జి కడప పట్టణంలో రాజీవ్‌పార్కు, ప్రకాష్‌నగర్, అరవిం దనగర్, పటేల్ నగర్, ఎర్ర ముక్కపల్లె, ఆర్‌కె నగర్, ఓంశాంతి నగర్ మొదలగు ప్రాంతాలలో అందు బాటులోకి వచ్చిందని తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి పదివేల గృహాలకు అందుబాటులోకి తీసుకురావాడానికి ఎజిఅండ్‌పి గ్యాస్ కృషి చేసు ందని అసిస్టెంట్ మేనేజర్ (ప్రాజెక్టు) తెలిపారు.

కెఓఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయ దినోత్సవం

కడప సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

ప్రతి ఏటా సెప్టెంబర్ 5న జరిపే ఉపాధ్యాయ దినోత్సవంను కడప నగరంలోని కందుల ఓబుల్ రెడ్డి మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజీలో అంగరంగ వైభవంగా జరిపారు. డిప్లొమా మరియు ఇంజనీరింగ్ విద్యార్థులు సం యుక్తంగా ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఉపాధ్యాయులపై తమ కున్న ప్రేమ, గౌరవాన్ని విద్యార్థులు తమ ప్రసంగాల ద్వారా తెలియపరచారు. ఆట పాటలతో సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డా గిరిధర్ మాట్లా డుతూ.. విద్యారులు భావి భారత నిర్మాతలు కావాలి అన్నారు. డా ఏ పి జే అబ్దుల్ కలాం వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసు కోవాలి అన్నారు. విద్యార్థులు కేక్ కట్ చేసి తమ గురువులకు పంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

గురువులందరికీ మంత్రి క్షమాపణ చెప్పాలి

ఒంటేరు శ్రీనివాసులు

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడిన రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ క్షమాపణ చెప్పాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఒక కార్యక్రమంలో మంత్రి గూగుల్ వచ్చిన తర్వాత గురువుల అవసరం లేని పరిస్థితి ఏర్పడిందని, గురువుల కన్నా గూగుల్ మిన్న అని ఉపాధ్యాయుల విలువ తగ్గేలా వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని చెప్పారు. గతంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా గురువు స్థానాన్ని భర్తీ చేయలేదని, పెద్దలు చెప్పినట్లు గురువు లేని విద్య గుడ్డివిద్య లాంటిదన్నారు. విద్య గురుశిష్యుల భావోద్వేగాలకు సంబంధించిన విషయమని దానికి గూగుల్ ఎలా ప్రత్యా మ్నాయంగా మారుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా, వారిని ఒక ప్రక్క ఆర్థిక దోపిడీ చేస్తూ మరోప్రక్క బోధనేతర పనులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నది చాలక తిరిగి వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదన్నారు. గురువును దైవంగా భావించే దేశంలో అదీ ఉపాధ్యాయ దినోత్సవం రోజున వారిని చులకన చేసి మాట్లాడినందుకు గాను మంత్రి తొలుత తనకు విద్య నేర్పిన తన గురువులకు క్షమాపణ చెప్పాలని, తరువాత రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ క్షమాపణలు చెప్పాలని పేర్కొన్నారు.

గురు రాఘవేంద్ర హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్ సెప్టెంబర్6, ప్రభాతవార్త

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక గిడ్డంగి వీధిలోగల శ్రీ గురు రాఘవేంద్ర హైస్కూల్లో శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థిని విద్యార్థులకు శ్రీ కృష్ణు వేషధారణ,గోపిక వేషధారణ ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కృష్ణుడు విశిష్టత గురించి విదార్థులకు తెలియ జేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మేకల రెడ్డయ్య, ఉమ మహేష్, ప్రభాకర్, సుధారాణి, చందన ప్రియ, రాధ, హిమ బిందు, తేజ, రేణుక, సుధమని, గౌసియా, లక్ష్మీదేవి, సుమానా, సౌమ్య, అరుణ, యామీన, సువర్ణ, ప్రసన్న కాలందర్, పుష్పరాజు, బాషా, శ్రీను, తరుణ్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

రాయచోటి సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి సాయిబాబా మందిరంలో బుధవారం సాయంత్రం బంజారా తీజ్ ఉత్సవ కమిటీ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో గిరిజనులు తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సాయిబాబా మందిరం నుంచి యువతులు ఉపవాస దీక్షలతో బుట్టను నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్ల నడమ గిరిజన యువతులు, మహిళలు సాంప్ర దాయ నృత్యాలు చేశారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి విశ్వనాథ నాయక్ మాట్లాడుతూ...పూర్వం సింధు రాజుల కాలం నుండి బంజారాల జీవన విధానంపై అనేక కథనాలు ఉన్నాయి అఖండ భారతావనిలో వందల ఏళ్ళ కాలం నుంచే బంజారాల పండుగలు ప్రత్యేకత కలిగి వున్నాయి. గోర్ బంజారాలు వారి కష్టం మీద వారే ఆధార పడుతూ స్వతంత్రంగా జీవించేవారు. నాడు ఏవిధంగానైతే భారతదేశంలో స్వయం పోషక గ్రామాలు వర్ధిల్లాయో, గోర్ బంజారా ఆవాసాలు కూడా స్వయంపోషక తండాలు గా వర్ధిల్లాయి అన్నారు. యువతులు తమకు మంచి వరుడుకావాలని దైవాన్ని కోరుతూ భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకోవడం ఇక్కడఆనవాయితీగా అన్నారు. గిరిజన యువతులు తొమ్మిది రోజులు అత్యంత నిష్టంగా ఉపవాసాలు చేశారన్నారు. పండుగలో భాగంగా తొలుత పుట్టమట్టిని తీసుకొచ్చి, వెదురుబుట్టలో దాన్ని వేసి ఆందులో గోధుమలు పోసి మొలకలు పెంచుతారు. ఇవి ఎంత పచ్చగా ఉంటే భవిష్యత్‌లో అంత ఆయురోగ్యాలు, సంతోషాలు కలుగుతాయని వారి నమ్మకం. ఉత్సవాల చివరి రోజున బుట్టల నుంచి మొలకలు వేరు చేసి పురుషుల తలపై పెడతారు. వాటిని ఇళ్లకు తీసుకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆనంతరం మొలకలను బాజ భజంత్రీల నడుమ పాటలు పాడుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడ సంఘం జాతీయ నాయకులు మూడే శంకర్ నాయక్, సమాచార శాఖ పిఆర్ఓ బుకే ధర్మానాయక్, దాడి కృష్ణ నాయక్,ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా నాయకులు నారాయణ నాయక్ బిల్లు నాయక్, గిరిజన నాయకులు తిరుపాల్ నాయక్, వినోద్ నాయక్ రాజారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే

రామాపురం, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

మండలం నుండి జిల్లాకు ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ రామకృష్ణుడు తెలిపారు మండలంలోని రాచపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాల వెంకటాపురంలో పని చేస్తున్న బి. విశ్వనాథ, చిట్లూరు గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాటశాల పాలన్నగారిపల్లె పాఠశాలలో పని చేస్తున్న ఏ వెంకట్రాంరెడ్డి , నల్లగుట్టపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాటశాల బి. రాచపల్లి లో పనిచేస్తున్న ఏ .రామచంద్ర ఎంపికైనట్టు తెలిపారు మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కలెక్టర్ గిరీష రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ప్రశంస పత్రాలు అందజేశారు రామాపురం మండలంలో ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. విశ్వనాథ తన దగ్గర చదువుతున్న విద్యార్థి ఆదర్శ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష లో 2023లో మండల మొదటి ర్యాంక్ సాధించారని తెలిపారు. విశ్వనాథ రామచంద్ర. మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాల బీసీ కాలనీలో పని చేస్తున్న సమయంలో 77 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో156 మంది విద్యార్థుల సంఖ్య పెంచడంలో వీరి కృషి చాలా ఉందన్నారు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడమే కాకుండా మండలం లో ఆదర్శ పాఠశాలగా తీర్చడంలో వీరి కృషి అమోఘం ఉన్నారు. రామచంద్ర బి రాచపల్లిలో పనిచేస్తూ పక్క గ్రామం నుండి విద్యార్థులు రావడానికి ఆటో చార్జీలు ఏడాదికి 5000 రూపాయలు తన సొంత నిధులతో భరిస్తూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచారు విశ్వనాథ్ 2008 నుంచి 2012 వరకు ఎమ్మార్పీగా మండల పాల నగారిపల్లిలో ఎంపీపీ పాఠశాల అభివృద్ధికి వెంకట్రామిరెడ్డి కృషి చేశారని తెలిపారు పాఠశాల అభివృద్ధికి పిల్లలను చేర్పించిన విధానంలో వీరి కృషి చాలా ఉందని అన్నారు మీరు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు

ఎంపీపీ ఆధ్వర్యంలో సోలార్ వెలుగులు

వీరబల్లి సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వీరబల్లిలో సోలార్ బల్బులను ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఏర్పాటు చేయడమైనది. ఎంపీపీ ఆదేశాల మేరకు నెట్ కేఫ్ మేనేజర్ ఎర్రం రెడ్డి దాతగా ముందుకు వచ్చి కావలసిన సోలార్ సిస్టం బల్బులను కొనుగోలు చేయడం జరిగింది వీటిని మండల కేంద్రంలో అవసరమున్న చోట్ల బుధవారం ఏర్పాటు చేయడమైనది. ఈ విషయం తెలుసుకున్న పలువురు ఎంపీపీకి అభినందనలు తెలిపారు

రాముడుకు బెయిల్ రావాలని పూజలు

చిన్నమండెం, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి (రాముడు)కు తొందరగా బెయిల్ రావాలని చాకిబండ పైన ఉన్న వీరాం జనేయ స్వామికి, చాకిబండ ప్రజలు 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లా డుతూ పుంగనూరు, అంగళ్ళు ఘటనలో వైసీపీ ప్రభుత్వం కుట్రపన్ని టిడిపి అధి నేత చంద్రబాబు నాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రముఖ తెలుగు దేశం పార్టీ నాయకులపై బనాయించిన అక్రమ కేసుల నేపథ్యంలో వారికి తొందరగా బెయిల్ రావాలని ఆంజనేయస్వామికి పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనంద్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రమణ, రాజేంద్ర, చిన్న పాపిరెడ్డి, రమణారెడ్డి, ఆస్పత్రి రామ్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, నాగిరెడ్డి ఆంజనేయులు రెడ్డి, ధర్మా రెడ్డి, జనార్దన్ రెడ్డి, జయనాథ్‌రెడ్డి, రమేష్, మల్లూరు హుస్సేన్, రవి, వెంకట రమణ పాల్గొన్నారు.

రవిశేఖర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

వైవీయూ సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

డాక్టర్ పి రవి శేఖర్ జన్మస్థలం నంద్యాల జిల్లా పెసరవాయి గ్రా మం. వీరి తండ్రి సత్యరాజ్ ప్రాథ మిక పాఠశాలలో ఉపాధ్యాయు డిగా పని చేస్తూఉద్యోగ విరమణ చేశారు. శ్రీ వెంకటేశ్వర విద్యాలయంలో పిజి,ఏం ఫిల్ పీహెచ్డీ పూర్తి చేసుకున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి బిఎడ్ పూర్తి చేసుకొని, 2011 ఏపీ పీఎస్సి ద్వారా డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా అనంతపూర్ ఆర్ట్స్ కళాశాలలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. తన ప్రతిభకు చిహ్నంగా 45 జాతీయ అంతర్జాతీయ పత్రికలలో తన పరిశోధనా పత్రాలను సమ ర్పించారు. 100 పరిశోధనా పత్రాలను వివిధ సెమినార్లలో సమర్పించారు. ఒక మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌ని కంప్లీట్ చేశారు. యంగ్ సైంటిస్ట్ అవార్డును తీసుకున్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్‌కి ఎన్నికయ్యారు. వీటితోపాటు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం వారి ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి ఏపీ స్టేట్ సైంటిస్ట్ అవార్డు తీసు కున్నారు. కళాశాలలో కూడా వివిధ కమిటీలలో నాక్ కోఆర్డినేటర్, పీజీ కన్వీనర్, డిబిటి కన్వీనర్‌గా పనిచేశారు. డాక్టర్ పి. రవిశేఖర్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డుకు సెలెక్ట్ కావడం పట్ల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ వై. సావిత్రి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

8వ తేదీ శివాలయంలో అష్టలక్ష్మి వ్రతం

ప్రొద్దుటూరుఅర్బన్ సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

శ్రావణమాస చివరి శుక్రవారం అనగా 8వ తేదిన పట్టణ నడిబొడ్డున ఉన్న శివాలయములో ఉదయం 9 గంటలకు అష్టలక్ష్మీవ్రతం 108 ముత్తైదులతో ఘనం గా నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ కొత్త మిద్దె రఘు రామిరెడ్డి, కార్య నిర్వణాధికారి శంకర్ బాలాజీ ఒక ప్రకటన తెలిపారు. హిందూ సంప్రదాయంలో లక్ష్మీదేవి సిరిసంపదల దేవత అని వివిధ భాగ్యాల అధిష్ఠాన దేవతగా భావిస్తామని దేవాలయాలలో అష్ట లక్ష్మిలను ఒకేసారి అర్చించడం మహా భ్భాగ్యమన్నారు. ఈ వ్రతం చేసుకోవడం వల్ల ధైర్యము, అదృష్టము, సంతానము, ఆయుస్సు, విజయము లభిస్తాయని వివరించారు. కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాల్గొన్న తలచిన మహిళలు ముందుగా దేవస్థానం కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

టిడిపితోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ

టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 5, ప్రభాతవార్త

రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం ప్రజల భవిష్యత్తుకు భరోసా టిడిపి తోనే సాధ్యమని టిడిపి ఇన్చార్జి జీవి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళ వారం స్థానిక విజయనగరం వీధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ వారి భవిష్యత్తుకు భరోసా కలిగించే తెలుగుదేశం పార్టీ ముందస్తు మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు నాగ సుబ్బరాయుడు మధుబాబు గిద్దలూరు వీరయ్య నరసింహులు కాటన్ బ్రహ్మం రెడ్డి సునీల్ కుమార్ రెడ్డి సూర్యనారాయణ పాణ్యం సుబ్బరాయుడు పిట్టా రవి శివ ఆర్ఎస్ శీను బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్ మస్తాన్ గోలే సునీల్ కుమార్ టిడిపి కార్యకర్తలు సుబ్రమణ్యం నరసింహ నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు నోచని గువ్వలచెరువు యానాదులు

రామాపురం, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

మండలంలోని గువ్వల చెరువు గ్రామానికి చెందిన యానాదులు ఆధార్ కార్డు లేక ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్నట్లు ఆ గ్రామానికి చెందిన పలువురు యానాది మహిళలు లక్ష్మీదేవి, దేవయ్య, గంగోజి, నిర్మల, సుబ్బరాయుడు, అంకమ్మ, ఎల్లమ్మ, పెంచలమ్మ, శంకరమ్మ, పార్వతి, లక్ష్మీనరసింహ మరో కొంత మంది తమకు ఆధార్‌కార్డులు రాకపోవడంతో ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. తమకు వయసు వచ్చి 35 కావస్తున్న మాకు ఇంతవరకు ఆధార్ కార్డు లేదని వారు తెలిపారు. వీరు కుటుంబ సభ్యులు అందరూ జీవనం కోసం దగ్గర్లోని పాలకొండలోకి వెళ్లి అక్కడే కాపురం ఉంటూ అడవి సంపద సంబంధించిన వస్తువులు తెచ్చి వాటిని విక్రయిస్తూ వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని వారు జీవనం కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. తమకు ఆధార్ కార్డు తీసేటప్పుడు తమకు ఏమాత్రం తెలియదని అన్నారు ఆధార్ కార్డు లేకపోవడంతో పథకాలకు దూరంగా ఉంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఆధార్ సెంటర్కు వెళితే ఆధార్ కార్డులో కొత్తగా తీసుకున్న దానికి ఆప్షన్ లేదని వాళ్ళు చెప్పడంతో యానాది మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. వారికి పిల్లలు పాఠశాలలో చదువుతున్న వాళ్లకి అమ్మబడి గాని ప్రభుత్వ పథకాలకు సంక్షేమ పథకాలకు నోచుకోలేదన్నారు స్థానిక మండల శాఖ అధికారు లందరినీ అడిగిన సచివాలయ సిబ్బందిని అడిగిన ప్రజాప్రతితులు అడిగిన తమకు ఏమా త్రం న్యాయం జరగలేదని సంబంధిత కలెక్టర్ స్పందించి వెంటనే తమకు ఆధార్ కార్డు వచ్చే విధంగా చేయాలని గువ్వల చెరువు గ్రామానికి చెందిన మహిళ యానాదులు తెలిపారు.

జగనన్న శాశ్వత భూ హక్కు సద్వినియోగం చేసుకోండి

మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

రామాపురం సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్షణ పథకం ఓ వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని గువ్వల చెరువు గ్రామ సచివాలయంలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న శాశ్వత భూహక్కుభూరక్ష పాస్ పుస్తకాలను లబ్దిదారులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో వివాదాలకు తావు లేకుండా సమగ్ర సర్వే చేసినట్టు స్పష్టం చేశారు. ప్రజలు తమ ఆస్తుల లావాదేవీలు గ్రామంలో కనిపించే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇటువంటి మంచి సంస్కరణ అమల్లోకి తీసుకొచ్చిన సీఎం వైస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్కీరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చేర్మెన్ కర్ణపు విశ్వనాథ్‌రెడ్డి తాసిల్దార్‌అరవింద్ కిషోర్, యంపిడిఓ హైదర్‌వల్లి. ఈవోపీ ఆర్డి ఉషారాణి. అరేయ్ రవికుమార్ కో ఆప్షన్ సభ్యులు జిలాని భాష వైఎస్ఆర్ సీపీ నాయకుడు శివయ్య. పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరి, మాజీ సర్పంచ్ ముబారక్, మాజీ కో ఆప్షన్ ఫైరోజ్ సచివాలయం సిబ్బ

నేడే అద్దెవారిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

మండలంలోని అద్దెవారిపల్లె పంచాయతీలో గురువారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని కార్యక్రమం ఉదయం 6 గంటలకే ప్రారంభం అవుతుందని ఎంపీడీవో గంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సచివాలయాల కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో గంగయ్య కోరారు.

వైభవంగా కృష్ణాష్టమి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఇళ్లలోని చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణతో అలంకరించి శ్రీకృష్ణుని తీర్థ ప్రసాదాలు అందించారు. స్థానిక సాయిబాబా ఆలయం, రామాలయం, కోసువారిపల్లెలోని శ్రీవెంకటేశ్వర ఆలయం, కుక్కరాజుపల్లిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, దూపదీప నైవేద్యాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ ఏడాది మారుమూల గ్రామాల్లో సైతం కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోవడం విశేషం.

శ్రీకిష్ణ జన్మాష్టమి వేడుకలకు రండి

ఆలయ కమిటీ సభ్యులు వెల్లడి

మదనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

శ్రీకిష్ణ జన్మాష్టమి వేడుకలకు తరలిరండి అంటూ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారిన గర్ గోవర్ధనగిరినందు శ్రీకిష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 5గంటలకు అభిషేకాలు, 9గంటలకు కళ్యాణోత్సవం, 11గంటలకు సాంస్కృతికకార్యక్రమాలు, 3గంటలకు వసంతోత్సవం, స్వామివారి ఊరేగింపు జరుగుతుందన్నారు. అభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.750లు చెల్లించి పాల్గొనవచ్చునన్నారు. కళ్యాణోత్సవంలో ఆసక్తి ఉన్నవారు రూ.1016చెల్లించి పాల్గొనవచ్చునని తెలిపారు. భక్తాదులు శ్రీకిష్ణ జన్మాష్టమి వేడుకలకు విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్‌చే ఆర్థికసాయం

మదనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ తరపున అనారోగ్యంగా ఉన్న మేస్త్రీ రమణకు రూ.16వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జె.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ ఎస్.రెడ్డిసాహెబ్‌లు మాట్లాడుతూ లేబర్ సెస్‌నుంచి ప్రభుత్వం సహాయం పూర్తిగా ఆగిపోయినందువల్ల ప్రమాదాలకు గురైన కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా కార్మిక శాఖామంత్రి స్పందించి అసంఘిటిత కార్మికులకు, లబ్దిదారులకు వెంటనే నిధులు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, మేస్త్రీలు పంచి రమణ, నాగేంద్ర, నారాయణ, రాడ్ బైడింగ్‌వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వర్‌రావులు పాల్గొన్నారు.

గడప గడప కార్యక్రమంతో సమస్యల పరిష్కారం

మదనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

గడప గడప కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రజాసమస్యలు పరిష్కారం అవుతున్నాయని 9వ వార్డు వైకాపా కౌన్సిలర్ బేబివెల్‌కం పాల్ చంద్రశేఖర్ తెలిపారు. గత రెండు రోజులుగా వార్డులో ఆయన కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులతో కలసి గడప గడప కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్ళడంవల్ల ప్రజాసమస్యలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి నవరత్న పథకాలు అర్హులైన వారందరికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హులుగా ఉండి పథకాలు అందని వారు మళ్లీ ధరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో వార్డులో ప్రజాసమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

వైభవంగా క్రిష్ణాష్టమి వేడుకలు

రామసముద్రం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

మండలంలోని శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు ఘనంగా బుదవారం జరుపుకొన్నారు. ఇందులో పిల్లలు క్రిష్ణుని గోపికల వేషదారణలతో ఆటపాటలతో అలరించారు. మండలంలోని దిన్నెపల్లె, కుదురుచీమనపల్లె, బరిడేపల్లె, ఎలావనెల్లూరు, బలసముద్రం గ్రామాల్లో కృష్ణుని ఆలయాల్లో పలు రకాల పుష్పాలతో అలంకరణలు చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు కృష్ణుని వేషదారణలతో ఆటల పాటలు అలరించాయి.

జగన్‌ను గద్దదింపండి : మోడీని సాగనంపండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

మదనపల్లె, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

జగన్‌ను గద్దదింపండి -- నరేంద్రమోడీని సాగనంపండి అని ప్రజలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. సిపిఐ చేపట్టిన బస్సుయాత్ర బుధవారం మదనపల్లెకు చేరుకుంది. ఈ సందర్భంగా మదనపల్లెలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 22 రోజుల పాటు 24 జిల్లాల్లో మహాసభలు నిర్వహించామన్నారు. ప్రతి జిల్లాలో బస్సుయాత్రకు ప్రజలు సంఘీభావం తెలిపి విజయవంతం చేయటం జరిగిందన్నారు. ప్రాజెక్టుల కోసం అప్పట్లో ఎన్టీఆర్ హంద్రీనీవా-గాలేరు, తెలుగుగంగా ప్రాజెక్టులను ప్రవేశపెట్టాలని నిర్ణయించగా, 1996లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పటికి 30 సంవత్సరాలు గడిచిన ప్రాజెక్టులు పూర్తికాకపోవటం మన దౌర్భాగ్యం అన్నారు. ప్రాజెక్టులు శంకుస్థాపనకే పరిమితం చేసిన ఎంపి, ఎమ్మెల్యేలను రాబోవు ఎన్నికలతో వారిని ఇంటికి తరిమిగొట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాని ఆర్థోగతి పాలు చేయటం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రకటించిన కడప-బెంగళూరు రైల్వేలైను పనులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తుంగలో తొక్కారన్నారు. వీరందరికి ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. అంతకుముందు బస్సుయాత్రకు స్వాగతం పలుకుతూ కార్యకర్తలు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి జెవి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, చేతివృత్తుల సంగం రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దుర్గభవాని, ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, చంద్రనాయక్, పెంచలయ్య, సాంబ, క్రిష్ణప్ప, మనోహర్‌రెడ్డి, వేమయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ నోటీసులపై ప్రతిపక్ష నేత బాబు స్పందించాలి

- వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులపై ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు స్పందించాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్జల్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం కడప వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ఆయన రూ.118కోట్లు కమీషన్లుగా దండుకున్నారని ఐటీ శాఖ రుజువులతో సహా బయట పెట్టిందన్నారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిన చంద్రబాబు నోరుమెదపకుండా ఉన్నారన్నారు. విపక్ష నేత అక్రమార్జనలో ఇది ఒక భాగం మాత్రమే అని ఆయన అక్రమాలను తెహల్‌కా డాట్‌కాం ఎప్పుడో బయట పెట్టిందన్నారు. వందల కోట్ల ప్రజా దనాన్ని వీరు లూటీ చేశారని ఆరోపించారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత వారికి లేదన్నారు. ఈ కార్యక్రమంలో నిత్య, ఫయాజ్ పాల్గొన్నారు.

గురువును గూగుల్‌తో పోల్చడం దేనికి సంకేతం ?

- గూగుల్ కన్నా గురువే మిన్న
- ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి

పోరుమామిళ్ళ రూరల్, సెప్టెంబర్ 06ప్రభాతవార్త:

సాంకేతిక పరిజ్ఞానంగా ఎంత అభివృద్ధి చెందినా అవేవి గురువులకు సాటి కావని, ఖచ్చితంగా గూగుల్ కన్నా గురువే మిన్న అని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ వాకా చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ళ యందలి ఎస్టీయు భవన్ నందు రీజనల్ కన్వీనర్ కె. పుల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్న రమణారెడ్డి, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసి, ప్రస్తుత మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ లాంటి సీనియర్ మంత్రి ఈ విధంగా గురువు స్థానాన్ని హేళన చేస్తూ మాట్లాడడం దేనికి సంకేతమో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. ఈ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం. శేఖర్‌బాబు, పుల్లారెడ్డి, మండల నాయకులు యు. సుబ్రమణ్యం, జయరామిరెడ్డి, వి.వి. క్రిష్ణారెడ్డి, సిద్దారెడ్డి, వెంకటరెడ్డి, అబ్దుల్ హుస్సేన్, గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాన్ని అడ్డుకొన్న రెవెన్యూ అధికారులు

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు అడ్డుకొన్నారు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులతో వాగ్వావాదం జరిగింది. మదనపల్లె మండలం కోళ్ళబైలు పంచాయతీ జగనన్నకాలనీలోని గుట్టలో కొద్దిరోజుల క్రితం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయనిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల విగ్రహప్రతిష్ట గావించి ఆలయ నిర్మాణ పనులు చేపడుతుండగా రెవెన్యూ అధికారులు తెలుసుకొని జేసిబితో గుడి గోడలను తొలగించడంతో అధికారులు,స్థానికుల మధ్య గొడవ జరిగింది. దీంతో రెవెన్యూ అధికారులు అక్కడ నుంచి వెనుదిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ నిర్మాణం కొనసాగేలా సహకరించాలని స్థానికులు కోరారు.

త్రిరత్నాలు

జైనమతంలో ప్రస్తావించినట్లు బౌద్ధమతంలో కూడా త్రిరన్నాల గురించి ప్రస్తావించారు. బుద్ధుడు, ధర్మ, సంఘం అనేవి బౌద్ధ త్రిరత్నాలు. వీటినే బౌద్ధ సంప్రదాయంలో,

1.బుద్ధం శరణం గచ్ఛామి 2. ధర్మం శరణం గచ్ఛామి

3. సంఘం శరణం గచ్ఛామి అని పేర్కొటారు. ప్రతి బౌద్ధ మతస్తుడు వీటిని తప్పనిసరిగా ఆచరించాలి.

మధ్యేమార్గం:బౌద్ధమతం మోక్షసాధనకు చూపిన మార్గాన్ని మద్యేమార్గం అంటారు. జైనమతం మోక్షసాధనకు అహింసతో కూడిన సల్లేఖన వ్రతాన్నిసూచించగా,బుద్ధుడు అష్టాంగమార్గాన్ని తెలియజేశాడు. బౌద్ధమతాన్నే ప్రతీయ- సము త్పాదన సిద్ధాంతంగా పేర్కొంటారు.

సాహిత్యం: బౌద్ధమత గ్రంథాలను త్రిపీటకాలు అంటారు. అవి వినయ పీటకం, అభిదమ్మ పీటకం,వీటిని ప్రాకృత భాషలో రంచించారు. హీనయానులు ప్రాకృతభాషను ఉపయోగిం చగా, మహాయానులు సంస్కృతానికి ప్రాధా న్యం ఇచ్చారు.ముఖ్యంగా ఆచార్య నాగార్జునుడు సంస్కృతంలో సుహృలేఖ, రత్నావళి రాజపరికథ, ఆరోగ్యమంజరి, రససిద్ధాంతం లాంటి గ్రంథాలను రచించాడు. వీటితో పాటు సింహళ గ్రంథాలైన మహావంశ, దీపవంశ విలువైన సాహిత్యంగా పేరొందాయి.

ఎస్పీ అన్బురాజన్‌కు వీడ్కోలు పలికిన నాయకులు

కడప వైద్యవిభాగం, క్రైం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ అన్బు రాజన్ బదిలీ కావడంతో అనంతను కాంగ్రెస్ మరియు టీడీపీ నాయకులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి బొకే ఇచ్చి వీడ్కోలు పలికారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎ.సత్తార్, ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య, టీడీపీ నాయకులు సుబ్బరాయుడులు మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా సామాన్య జనానికి అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై వెంటనే స్పందిస్తూ చాలా బాగా సహకరించిన జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

గురువులను అగౌరవపరచడం సరికాదు

- ఏపీఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామాంజనేయులు

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

విద్యార్తులకు విద్యను బోధించడంలో గురువును మించిన వారు లేరని ఏపీఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామాంజనేయులు పేర్కొన్నారు. కడపలోని ఏపీఎస్టీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ గురువుల కన్నా గూగుల్ మిన్న అని ఉన్నత విద్యావంతుడైన ఒకప్పటి విద్యాశాఖామంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడడం ఉపాధ్యాయులు తక్కువ చేసి మాట్లాడే విధంగా ఉందన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించాలన్న, సామాజిక విషయాల గురించి అవగాహన కల్పించాలన్నారు. కరోనా కాలంలో కూడా గురువుల యొక్క ప్రాధాన్యత ఏమిటనేది ప్రపంచం మొత్తానికి తెలిసిందన్నారు. ఉపాధ్యాయులకు మరియు ఎంతఓలకు 3 నెలలుగా జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ జీపీఎస్ తెస్తానని చెబుతున్న ప్రభుత్వ విధానాన్ని మార్చుకోవాలని ఓపీఎస్ మాత్రమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థుల స్వేచ్ఛను కాలరాస్తున్న కళాశాలలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

ఉమ్మడి కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాలలో కూడా తరగతులు నిర్వహిస్తున్నారని ఇంటర్ అధికారుల ఆదేశాలు లెక్క చేయకకుండా తరగతులు నడపడం సరైంది కాదని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. పోరుమామిళ్ల, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల, అన్నమయ్య జిల్లాల్లో రాయచోటి పట్టణం, రైల్వేకోడూరు ప్రాంతాల్లో బుధవారం అధికారులు సెలవు ఇవ్వాలని ప్రకటించినప్పటికీ వారిని లెక్క చేయకుండా ఇంటర్ బోర్డు ఆదేశాలను దిక్కరించి తరగతులు నిర్వహించారని విద్యార్థుల స్వేచ్ఛను హరింపజేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇంటర్ అధికారులు స్పందించి విచారణ జరిపి ఆయా ప్రైవేటు జూనియర్ కళాశాలలు విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

కురబలకోట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మండల అధ్యక్షులు దస్తగిరిసాబ్ అన్నారు. బుధవారం క్రిష్ణాష్టమిని పురస్కరించుకొని కురబలకోట పశువైద్యశాల వద్ద 26మంది పాడి రైతులకు గడ్డికత్తరించే యంత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యంత్రం విలువ రూ.34వేలు, ఒకొక్కటి దానిపై రూ.13,500లు సబ్సిడీ పోనూ, రూ. 20500లకే రైతులకు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో మొత్తం 112మందికి ఈ యంత్రాలను సబ్సిడీపై పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు కురబలకోట పశువైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి సౌజన్య, ఆర్బీకే ఛైర్మెన్ శివశంకర్‌రెడ్డి, గోపాలమిత్ర అమరనాథ్, పాడిరైతులు పాల్గొన్నారు.

దళితుల భూముల స్వాహాకు యత్నించిన అగ్రవర్ణాల వారు

- మామిడి చెట్లు నరికేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ మరియు దళిత నాయకుల డిమాండ్

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలం సాగర పంచాయతీలో నివసిస్తున్న దళితులకు సంబంధించిన వారసత్వ భూములు అయిన చిన్నఓరంపాడు రెవెన్యూ పొలం 247 మరియు 248 సర్వే నంబర్లలో ఉన్న భూములను గత కొన్ని సంవత్సరాలుగా దళితులు అనుభవిస్తూ ఉండేవారని వారి కారనాల వల్ల వందల సంవత్సరాల భూములు వ్యవసాయం చేసుకోలేక అధికంగా బండరాళ్లు ఉండడంతో వ్యవసాయానికి అనువుగా లేనందున కొద్ది రోజులు వ్యవసాయాన్ని నిలిపివేయడంతో బి.చెన్నయ్య పేరుపైన ఉండడంతో ఆయన వారసులు భూములు చదును చేస్తామనుకున్న సమయంలో కటికంవారిపల్లి గ్రామానికి చెందిన వీరప్పగారి చంద్రయ్య, నాగేంద్ర, పెద్ద సుబ్బరాయుడు, మనోజ్, రామచంద్ర, నాగేశ్వరరావు 10 రోజుల క్రితం జేసీబీ యంత్రాలతో చదును చేస్తుండగా హక్కుదారులైన దళితులు అడ్డుకొని పనులు ఆపేశారు. ఆ తరువాత ఈనెల 2, 3 తేదీల్లో జేసీబీలతో యంత్రాల సహాయంతో వేప చెట్లు, నిమ్మ చెట్లు 20 సంవత్సరాలు వయసున్న వాటిని తొలగించి దళితులు భూములు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అనంతరం బుధవారం ఉదయం చెట్లు నాటి ఉంటే వారు చెట్లను పీకేసి ఆస్తి నష్టం కలిగేలా చేశారని దళితులు ఆరోపిస్తున్నారు. అలాగే వారు తమను కులం పేరుతో దూషించారని వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. 10 రోజుల క్రితం తమ భూములను అగ్రవర్ణాల వారు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పోలీసులు సకాలంలో స్పందించిఉంటే ఈ నష్టం జరిగేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. 45 రోజుల క్రితం తమ భూముల పత్రాలు తహసీల్దారుకు చూపించినా ఈ దారుణాలు జరిగాయని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చంద్రబాబునాయుడు పెద్ద వెన్నుపోటుదారుడు

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

స్థానిక వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అత్యంత ధనికుడని ఆయన వెన్నుపోటుదారుడని మామను గద్దె దింపి అధికారంలోకి వచ్చిన చరిత్ర చంద్రబాబునాయుడిదన్నారు. అంతేకాకుండా ఆయన దాదాపు 15 సంవత్సరాలు సీఎంగా పని చేసినా ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేసిన చరిత్ర లేదన్నారు. ఎప్పుడు ఆయన బినామీలకు దోచిపెట్టడమే తప్ప ప్రజలకు ఖర్చు పెట్టింది లేదన్నారు. ఆయన ఐటీ శాఖ రూ.118 కోట్ల స్కాం నోటీసులపై జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మోక్షజ్ఞ పుట్టిన రోజు వేడుకలు

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

కడప నగరంలోని హబీబుల్లా వీధిలో గల బాలకృష్ణ మరియు జూ.ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ ఉపాధ్యక్షులు షేక్ అల్లా బకాష్ ఆధ్వర్యంలో హిందూపురం ఎమ్మెల్యే సినీ హీరో యువతర్న నందమూరి బాలకృష్ణ కుమారుడు నందమూరి మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెదేపా రైతు విభాగం నాయకులు లక్ష్మిరెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేసి మాట్లాడారు. తాతకు మించిన మనవడిగా తండ్రికి తగ్గ తనయుడిగా ఎదగాలని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, కువైట్ ఎన్ఆర్ఐ మైనార్టీ విభాగం కన్వీనర్ రహ్మతుల్లా, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమ్మల పాటి సుబ్బరాయుడు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు సందా సురేంద్రకుమార్, టీడీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి, క్రిస్టియన్ సెల్ పార్లమెంటు జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, 28వ డివిజన్ ఇన్‌ఛార్జి గాజులపల్లి రాఘవ, 1వ డివిజన్ ఇన్‌ఛార్జి మురికినాటి రామాంజనేయులు, 8వ డివిజన్ ఇన్‌ఛార్జి నటరాజ్, మైనార్టీ నాయకులు షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అతి వేగం ప్రమాదకరం

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరికి మోటారు బైకు ఎంతో అవసరం. దానిని అతి వేగంగా నడిపి ప్రాణాలు పోగొట్టుకోకూడదని ఏపీ ప్రభుత్వ రాష్ట్ర ఆడిట్ సర్వీస్ అసోసియేషన్ మాజీ ఛైర్మన్ సయ్యద్ అహ్మద్ అన్నారు. రాయల్ రషీద్ సంఘం ఆధ్వర్యంలో మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలనే పోస్టర్లను వారి కార్యాలయంలో విడుదల చేశారు. తమ తల్లిదండ్రులు తమ బిడ్డలను మోటారు బైకు నుంచి వచ్చేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వారికి వివరించాలని సయ్యద్ అహ్మద్ తెలిపారు.

జాతీయ టాలెంట్ హంట్ పరీక్ష

- బైజూస్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్

కడప కార్పొరేషన్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

ఆకాష్ నేషనల్ టాలెంట్ మంట్ పరీక్ష అక్టోబరు 7 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు బైజూస్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాష్ ఇన్‌స్టిట్యూట్ జాతీయ స్కాలర్షిప్ పరీక్ష 9, 10, 11, 12 తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వంద శాతం స్కాలర్షిప్, నగదు అవార్డులను అందించనున్నామన్నారు. పరీక్ష ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి నిపుణుల మార్గదర్శకత్వం మెంటార్‌షిప్ పొందవచ్చని తెలిపారు. వంద మంది విద్యార్తులను ఐదు రోజుల పాటు అన్ని ఖర్చులతో కూడిన జాతీయ విజ్ఞాన యాత్రలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ పరీక్ష ప్రారంభానికి 3 రోజుల ముందు ఆఫ్‌లైన్ పరీక్షకు 7 రోజుల ముందు వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ పరీక్ష ఉచితంగా, ఆఫ్‌లైన్ పరీక్షకు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో బైజూస్ రీజనల్ సేల్స్ గ్రోత్ హెడ్ భరత్‌కుమార్, కడప బ్రాంచ్ హెడ్ నరసింహులు, ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీస్ లిమిటెడ్ సీఈవో అభిసేక్ పాల్గొన్నారు.

8న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

గాలివీడు, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :

మండలంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జగనన్నకు చె పుదాం కార్యక్రమము 8-9-2023 వ తేదీన ఉదయం 9.30 గంటలకు జరుగునని ఎంపిడివో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా

బీఎస్‌రాంబాబుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

పీలేరు, సెప్టెంబరు 6 ప్రభాతవార్తః

పట్టణంలోని సుధాసుధీర్ వీధికి చెందిన బీఎస్ రాంబాబు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాయచోటి లయగార్డెను స్ హాలులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాయచోటి లయ గార్డెన్సులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, శాసన సభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం చేతులు మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. బీఎస్.రాంబాబు నిమ్మనపల్లె మండ లం బండ్లపై ఎంపీయూపీ పాఠశాల నందు స్కూల్ అసిస్టెంటు(హిందీ)గా పనిచే స్తున్నారు. డీఎస్సీ-2008 బ్యాచ్‌లో ఎంపికై ఇప్పటివరకు తను పనిచేసిన అన్ని మండలాల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల, అధికారుల మన్ననలు అందుకున్నారు. ప్రస్తుతం తను చేస్తున్న ఎంపీయూపీ పాఠశాలలలో విద్యార్తుల సంఖ్య తగ్గడంతో తిరిగి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి పాఠశాల అభివద్ధికి తన వంతు కషి చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత రాం బాబు మాట్లాడుతూ ఈపురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని విద్యార్తులకు నాణ్యమైన విలువతో కూడిన విద్యను అందించేందుకు కషిచేస్తాన న్నారు. హిందీ మన జాతీయ బాష కాబట్టి మన మాతబాషతో పాటు హిందీకి కూడా విద్యార్థులు ప్రాధాన్యత ఇస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ రోజుల్లో చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రనయివేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఇలాంటి తరుణంలో రాంబాబు తన ఇద్దరు కుమా రులను ప్రభుత్వ పాఠశాలలో నిమ్మనపల్లె మండడలంలోని రెడ్డివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిస్తూ ఇతర ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆదర్వంగా

దివ్యాంగ చిన్నారులకు దుస్తులు పంపిణీ

వేంపల్లె, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :

వేంపల్లెలోని భవిత దివ్యాంగుల కేంద్రంలో చదువుతున్న ఇన్నారులకు జెవి వినోద్‌కుమార్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమంలో ఎంఈవో స్టాలిన్ ఐజాక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సహాయం అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. వీటిని నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రస్టు నిర్వాహకుడు బాలస్వామి మాట్లాడుతూ తమ కుమారుడి జ్ఞాపకార్థం ఈ ట్రస్టు ఏర్పాటు చేశామని, మదర్‌థెరిస్సా వర్ధంతిని పురస్కరించుకుని చిన్నారులకు వస్త్రాలు పంపిణీ చేశామన్నారు. దివ్యాంగ చిన్నారులకు ఏ సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాల హెచ్ఎం నరసింహారెడ్డి, ఐఈఆర్టీలు యశోద, సుజాత, సీఆర్పీలు నాగరాణి, స్యూకుమారి, సుజాత, ఫిజియోథెరఫిస్టు డాక్టర్ ఆనంద్, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడు నాగన్న, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

- బదిలీపై వెళ్లిన సీఆర్పీలకు ఘన సన్మానం ః

వేంపల్లె విద్యా వనరుల కేంద్రంలో సీఆర్పీలుగా పనిచేస్తూ వేముల, లింగాల మండలాలకు బదిలీపై వెళ్లిన సీఆర్పీలు ప్రకాష్‌రెడ్డి, దున్నపాటిలను ఎంఈవో స్టాలిన్ ఐజాక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం వేంపల్లె విద్యా వనరుల కేంద్రంలో సిబ్బందితో పాటు ఎంపీపీ మెయిన్‌స్కూల్, హెచ్ఎం నరసింహారెడ్డి, ఐఈఆర్టీలు యశోద, సుజాత, తదితరులు శాలువాలు, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడ పనిచేసినా అంకిత భావంతో చేయాలని ఎంఈవో స్టాలిక్ ఐజాక్ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు సూర్యకుమారి, నాగరాణి, సిబ్బంది అబ్దుల్ ఖాదర్, కవిత, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు తగవు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :

తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయ్ స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారానికి తెరలేపాయి. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా, కరోనా లాంటి వ్యాధులతో పోల్చారు.. దానిని వ్యతిరేకించడం కాదు, పూర్తిగా నిర్మూలించాలని ఆయన అనడం తగదన్నారు. ఈ సందర్భంగా పాతబస్టాండులోని పద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామి ఆలయం నుండి పూలంగళ్ల వరకు జైశ్రీరామ్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో ర్యాలీ కొనసాగించారు. అనంతరం ఉదయ్‌స్టాలిన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శశిభూషణ్‌రెడ్డి, విద్యాధరి భానుప్రకాష్, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చంద్ర, మహేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి చిత్తడిగా ప్రొద్దుటూరు రోడ్డు

దువ్వూరు, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరు నుంచి ప్రొద్దుటూరు వెళ్లే రహదారి పంచాయతీ ఆఫీసు నుంచి రామకృష్ణ థియేటర్ వరకు చిత్తడి చిత్తడిగా మారి పాదాచారులను, ద్విచక్ర వాహనదారులను, కార్లను ఇబ్బంది పెడుతోంది. గత 3 రోజులుగా వర్షాలు పడుతుండడం వల్ల ఈ దారిన వెళ్లాలంటే వాహనదారులు పాదాచారులు భయపడుతున్నారు. గతంలో ఆ రోడ్డుపై నీరు నిలబడుతోందని ఉద్దేశంతో పంచాయతీ అధికారులు ఎర్రమట్టి తోలారు. అయితే పంచాయతీకి సంబంధం లేకపోయినా ఎర్రమట్టి తోలడం సంతోషమే కానీ ఆ మట్టి ఈ వర్షానికి బురదమయంగా మారింది. దీంతో ఆ దారిన వెళ్లాలంటే బయపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు వెళ్లలేక కింద పడి గాయాలపాలవుతున్నారు. వాహనాలు వెల్లే సమయంలో బురదతో జారి వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ రోడ్డు రోడ్లు భవనాల శాఖ పరిధిలోకి వస్తుంది. వారి స్పందించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల స్తానిక ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. రూ.40లక్షల మేరకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ఇంత వరకు ఆ ప్రతిపాదనలు ఎక్కడున్నాయో తెలియడం లేదు. ఈ దారిన వెళ్లాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాత్కాలికంగా అయినా ఉపశమనం కల్పించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- టీడీపీలో పలు కుటుంబాలు చేరిక

వేంపల్లె, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పులివెందుల నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేర్కొన్నారు. వేంపల్లె మండలంలోని తువ్వపల్లె, అలిరెడ్డిపల్లె గ్రామాల్లో బుధవారం బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గోపీనాథ్‌రెడ్డితో పాటు పలు కుటుంబాలు స్వచ ్ఛందంగా టీడీపీలోకి చేరాయి. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వారికి తెదేపా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి టీడీ పీ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాబోయే సార్వత్రిక ఎన్ని కల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న చేరికలే తెదేపా గెలుపునకు నాంది అని, సీఎం జగన్‌ను ఓడించేందుకు ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తోందన్నారు. మంత్రికి బుద్ధి చెప్పే ్ సమయం ఆసన్నమైందని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఓడించేందుకు ప్రజ లు సిద్ధంగా ఉన్నారన్నారు. బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్ర మాన్ని చేపట్టామని, ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, మహమ్మద్ షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, ఎన్ఎస్ దర్బార్, బాలక్రిష్ణారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, డాక్టర్ సుబ్బా రెడ్డి, రామగంగిరెడ్డి,

వైకాపాలో కష్టపడే వారికి సముచిత స్థానం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :

వైకాపాలో కష్టపడే వారికి సముచిత స్థానం దక్కుతుందని వైకాపా జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు అన్నారు. ఇటీవల వైకాపా జిల్లా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన దాసరి శశికాంత్‌రెడ్డి బుధవారం కడపలో ఉన్న సురేష్‌బాబును కలిసి తనను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టరు హాల్ గంగాధర్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర డైరెక్టరు సురేష్‌రెడ్డి, న్యాయవాదులు ఓబుళరెడ్డి, సింహాద్రిపురం మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని మైసూరువారిపల్లె పంచాయతిలో వెలసి ఉన్న వేణుగోపాలస్వామి దేవాలయంలో బుధవారం అత్యంత వైభవోపేతంగా శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునుండే భక్తులు వేణుగోపాలస్వామి గుడికి చేరుకుని ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి స్వామివారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యంగా వేణుగోపాలస్వామి ఆలయ నిర్వాహకులు దేవాలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చక్కటి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అతిరథ మహారథులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నరసింహులు, మాజీ ఆలయ అధ్యక్షులు బత్తిన గంగయ్యయాదవ్, వెంకటయ్య, నాగేశ్వరరావుతో పాటు పలువురు ఆలయ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

కనుల విందుగా కళ్యాణం - అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చిట్వేలి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా చిట్వేలి మండల పరిధిలోని చిల్లావాండ్లపల్లె గ్రామం, రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి మందిరంలో వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మూల విగ్రహాన్ని ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు, గ్రామస్థులు మూల విగ్రహాలకు కళ్యాణాన్ని కనులవిందుగా జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం, వసంతాలను నిర్వహించారు. గురువారం ఉదయం విగ్రహాలకు గ్రామోత్సవం కార్యక్రమం ఉంటుందని ఆలయ పెద్దలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామస్థులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబును సిఎం అయ్యేందుకు యువతదే కీలక పాత్ర

టిడిపి సీనియర్ నేత జగన్‌రాజు

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

జగన్ హయాంలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని అన్నివిధాల ముందుకు తీసుకు పోయేందుకు తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని రాజంపేట నియోజకవర్గ సీనియర్ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం ఆర్ఎస్ రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలుగు యువత విభాగం సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సిఎం కావాలంటే యువత కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను యువత పరిశీలిస్తే చంద్రబాబు సిఎం కావడం ఎంత అవసరమో తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో రాక్షస విధ్వంసపాలన నడుస్తోందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే యువతకు నిరుద్యోగ బృతి కింద 3 వేల రూపాయలు, ఉద్యోగ ఉపాది అవకాశాలు పెద్దఎత్తున కల్పించడం, అన్ని రంగాల సర్వతోముఖాభివృద్ధి కోసం పార్టీ అధినేత మేనిఫెస్టో సిద్ధం చేశారన్నారు. యువత రానున్న 6నెలలు పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

చిన్నికృష్ణుని చల్లని చూపు ప్రజలపై పడాలి

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

భగవద్గీతలో అందరికి సందేశాన్ని ప్రబోదించిన శ్రీకృష్ణుని పరమాత్ముని చల్లనిచూపు ప్రజలపై పడితే చాలని అదే ప్రార్థించానని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఊటుకూరు యాదవ్‌కాలనిలో కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెలే ్య పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నికృష్ణుని వేషదారణలో ముచ్చటగొలిపిన చిన్నారులను ముద్దాడారు. చిన్నారుల తల్లిదండ్రులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నాగా పృద్వీపరెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసరాజు, కృష్ణారావు, సుండుపల్లె జడ్‌పిటిసి ఇస్మాయిల్, రాజేష్, పాలగిరి మల్లికార్జునరెడ్డి, రాజేష్, కౌన్సిలర్ తంబా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుపాలుదిన్నెలో భూపేష్‌రెడ్డి పర్యటన

జమ్మలమడుగు, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

పెద్దముడియం మండలం తిరుపాలుదిన్నె గ్రామంలో బుధవారం జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో 15 కుటుంబాలు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఆయన పార్టీ కండువాలు వేసి వారిని తెదేపాలోకి ఆహ్వానించారు. వైకాపా అరాచకాలు అనగాలంటే వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమనారెడ్డి, పెద్దముడియం మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు, దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా లోకకల్యాణార్థం కోసమే హోమం

- నిర్వాహకులు కె.విజయానందరెడ్డి రాధాకృష్ణమూర్తి, భారవి

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

లోక కల్యాణార్థం శ్రీ సర్వేశ్వర మహర్షి ఆశ్రమంలో గల శ్రీరాజరాజేశ్వరి మందిరంలో మహాసుదర్శన హోమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ ధార్మికవేత్త కల్లూరు విజయానందంరెడ్డి, సర్వేశ్వర మహర్షి సేవా సమితి అధ్యక్షులు ఎన్.రాధాకృష్ణ మూర్తి, పుష్పగిరి క్షేత్ర ధర్మ పరిరక్షణ సేన ఎస్.బారవి తెలిపారు. నగరంలోని సప్తగిరి నగర్‌లో ఉన్న శ్రీకంచి కామకోటి పీఠం శ్రీ సర్వేశ్వర మహర్షి ఆశ్రమ సేవా సమితిలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతిస్వామి, విజయ్ బట్టార్ వారి దివ్య ఆశీస్సులతో మహా సుదర్శన హోమాన్ని నిర్వహించామన్నారు. సకల జీవకోటి సుభిక్షంగా ఉండాలని సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఈ హోమం నిర్వహిస్తున్నామన్నారు. లోక కల్యాణార్థం నిర్వహించే మహా సుదర్శన హోమంలో ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, ఉమామహేశ్వర రావు, కె.రఘునాథ్, గానుగపెంట హనుమంతరావు, శివశ్రీ శర్మ సుధీర్, కార్పొరేటర్లు మానస, మల్లికార్జున, సూర్యనారాయణలకు సన్మానం చేశారు.వీరితో పాటు పలువురు భక్తిశ్రద్ధలతో అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాలూకా సీఐగా బాధ్యతలు చేపట్టిన రాజా

- ఉలసయ్య రామగిరికి బదిలీ

కడప క్రైం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:

కడప నగరం తాలూకా ఇన్‌స్పెక్టర్‌గా పి.రాజా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఉలసయ్యను అనంతపురం జిల్లా రామగిరి సర్కిల్‌కు బదిలీ చేశారు. రాజా 2002 ఎస్సై బ్యాచ్‌కు చెందిన వారు. ఈయన సబ్ ఇన్‌స్పెక్టరుగా ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు స్టేషన్‌లో విధుల్లో చేరాడు. 2012లో సీఐగా పదోన్నతి పొంది కడప సీసీఎస్, బద్వేలు, రామగిరిలో సీఐగా, ధర్మవరం టుటౌన్ సీఐగా పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాలూకా పరిధిలో అసాంఘిక కార్యకలాపాలతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే మహిలలు, చిన్నపిల్లలకు తన పరిధిలో రక్షణ కల్పించడంతో పాటు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు కూడా ఏదైనా సమాచారం ఉంటే తమ దృష్టికి తెచ్చి సహకరించాలని కోరారు.

ఉదయనిధి స్టాలిన్‌పై హిందూ సమాజం తిరగబడాలి

- బీజేపీ బద్వేల్ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ ఉట్టి శ్రీనివాసులు

పోరుమామిళ్ళ రూరల్, సెప్టెంబర్ 06ప్రభాతవార్త:

సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని సకల్పించిన తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ యావత్ హిందూ సమాజం తీవ్రంగా ఖండించాలని బద్వేల్ బీజేపీ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ ఉట్టి శ్రీనివాసులు పిలుపునిచ్చాడు. సనాతన ధర్మం అంటే క్రమశిక్షణతో కూడిన జీవన విధానంఅనే విషయం అందరూ తెలుసుకోవాలన్నారు. హిందూ దేవుళ్ళపైన, హిందూ సమాజంపైన, హిందూ సంస్కృతి, సంప్రదాయాలపైన ప్రనతివాడు విమరి ్శంచడం, నోటికి వచ్చినట్లు మాట్లాడడం నేటి తరంలో ఫ్యాషన్ అయిపోయిందన్నారు. హిందూ దేవుళ్ళపై జరుగుతున్నటువంటి అన్యాయాలు, అఘాయిత్యాలపైన హిందూ సమాజం ప్రశ్నించకపోవడం వల్లనే ఇటువంటి వారందరూ పెట్రేగిపోతున్నారన్నారు. అసనాతన ధర్మం అంటే ఉన్నతమైనటువంటి జీవన విధానమని, క్రమశిక్షణతో కూడినటువంటి జీవన విధానమని రాజకీయ పార్టీలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి పోరుమామిళ్ళ మండలాధ్యక్షుడు పల్లంశెట్టి పండరి, బిజెపి జిల్లా కార్యదర్శి రమణాచారి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి వంకదారి జయరాం, బిజెపి మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

బిజేపి చేతిలో జగన్, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కీలు బొమ్మలు



రాయచోటి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త

బిజెపి చేతిలో జగన్, చంద్రబాబు ,పవన్ కళ్యాణ్ లు కీలుబొమ్మలుగా మారారని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి బజన్ రెడ్డిగా, చంద్రబాబు నాయుడు చెక్కభజన నాయుడుగా మారడం శోచనీయమన్నారు. ఇటువంటి నాయకులు ఒకరు ముఖ్యమంత్రిగాను మరొకరు ప్రతిపక్ష నాయకులుగా ఉండడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని పేర్కొన్నారు. బిజెపి వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లా స్టీల్ ప్లాంట్, దుగ్గరాజుపట్నం ఓడరేవు, పోలవరం, విజయవాడ మెట్రో, విశాఖ రైల్వే జోన్, విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఊసే లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ అల్లా బకాష్ సిఎల్సి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఇలాంటి మోసపూరిత పార్టీలను నమ్మరని రాబోయేది కాంగ్రెస్ పార్టీ అని ఆయన జోష్యం చెప్పారు ఈ కార్యక్రమంలో ఎస్ఎండి గౌస్, చెన్న కృష్ణ ,ఖాదరవల్లి ,ఖదీర్ ,రమణమ్మ ,మహమ్మద్ రఫీక్, దినకర్ ,నరేష్ ,మైసూరా రెడ్డి,ఫరూక్, నరేష్ దర్బార్, ఫారుక్, రఫీ, నర్సింహారెడ్డి ,ఉత్తన్న ,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న

వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.ఎస్.హరినాథ్‌రెడ్డి

రామాపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయ చోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి వాస్తవ్యులు బోయపాటి విజయ శంకర్ నాయుడు వర్ధంతి సందర్భంగా ప్రమీల ఆయన కుమారుడు అశోక్ కుమార్ నాయుడు కోడలు స్వరూప రెండవ కుమారుడు హరి ప్రసాద్ నాయుడులు ఆర్థిక సౌజన్యంతో రామాపురం మండలం బండపల్లె సమీపంలో ఉండే ప్రేమాలయం వృద్ధాశ్రమం లో బుధవారం అన్నదాన కార్యక్రమం చేయడం జరిగిందని వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి ఎస్ హరినాధ రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. అనంతరం దాతలు ప్రమీల.అశోక్ కుమార్ నాయుడు,స్వరూప, హరి ప్రసాద్ నాయుడులు మాట్లాడుతూ బోయపాటి విజయ శంకర్ నాయుడు వర్ధంతి పురస్కరించుకొని ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ప్రేమాలయం ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం చేయడం జరిగిందని అన్నారు. అలాగే రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి మా వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్ వి.నారాయణ రెడ్డి,లయన్ రామాంజనేయులు ,ఆశ్రమం మేనేజర్లు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మా సంబరాలు

వేంపల్లె, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :

వేంపల్లె మండలంలోని రామిరెడ్డిపల్లెలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా సెప్టెంబరు 1 నుండి 30వ తేదీ వరకు జరిగే పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టార్2 పరిధిలో పోషణ మా సంబరాలను సూపర్‌వైజరు నాగరాత్న ప్రారంభించారు. ఈ సందర ్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం ఇవ్వాలని, అప్పుడే తల్లులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం పదార్థాలను ప్రతి ఒక్కరికీ అందిస్తున్నట్లు చెప్పారు. వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి తల్లి తన బిడ్డకు పౌష్టికాహారం అందించాలని, అప్పుడు బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అలాగే పోషణ ఉన్న ఆహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశ, బీఎంఎస్‌కె, గర్భిణీ, బాలింత మహిళలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవరు హత్యకేసులో ప్రధాన నిందితుడు వలంటీర్ కిశోర్ అరెస్టు

పీలేరు, సెప్టెంబరు 6 ప్రభాతవార్తః

పీలేరులో గత నెల 31న అనుమానాస్పద స్థితిలో మతిచెందిన ఆటో డ్రైవరు సుధాకర్ మతిచెందిన ఆటో డ్రైవరు సుధాకర్ మతికి కారణమైన ప్రధాన నింది తుడు పీలేరు ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన జయరామయ్య కుమారుడు కిశోర్ వలంటీర్‌